# ఆత్మసాక్షాత్కారం



శ్రీధర్

అక్కాక డాక్ బంగళా.

దానికి దగ్గర్లో ఉన్న గ్రామం దరిద్రానికి కూడ దగ్గరగానే ఉంది. అయినా బక్కచిక్కిన శల్య పంజరాల్లాంటి ప్రాణులు - ముఖ్యంగా మనుషులు, కుక్కలతో మాత్రం సుసంపన్నంగా ఉంది.

కుక్కల్ని మినహాయించినా, ఇంకా ఎంతో ప్రాణశక్తితో నిండి ఆ గ్రామంతో, సహజంగానే ఒక మంత్రిగారికి పని

పడింది. అలా అవసరపడివచ్చిన మంత్రి గారు, అంతకన్నా అవసరపడివచ్చిన చీకటివల్ల, ఆ రోజు రాత్రికి, పాపం డాక్ బంగళాలోనే విశ్రమించారు.

మంత్రిగారి రాక ఆ ఊరి ప్రాణి కోటికి, కనీసం కాకైనా చెప్పలేదు. వార్తాపత్రికలు చెప్పాయిగాని, అవి ఆ ఊరి పొలిమేరలకి కూడ రావు. అందు చేత వాటిని చదివేపాటి మనుషులకి గాని, చించి తూర్పారబట్టే కుక్కలకిగాని, అతని రాక తెలియలేదు.

అయినా అవి (కుక్కలు) బారులు తీరి డాక్‌బంగళా చేరుకొన్నాయి. కారణం, వాటి పసిగట్టే స్వభావంవల్ల కాదు, చీకటిపడేసరికి అక్కడికి చేరుకొనే అలవాటువల్ల. అలా చేరుకొన్న కుక్కలు ప్రసన్న గంభీరమయిన ఆ వాతావర ణంలో బంగళా గచ్చుమీద తీరుబడిగా విశ్రమించి, వంతులవారీగా ఆనంద భైరవిని ఆలాపించసాగాయి.

భౌవ్, వౌ, వౌ, వౌ, వౌ... భౌవ్

కేంవ్, వేవ్, వేవ్, వేవ్.... కేంవ్,

గుర్, కుర్, కుర్, కుర్... గుర్—

అంటూ సాగిందా ఆలాపన.

మాగన్నుగా పడుకొన్న మంత్రిగారు అదిరిపడి లేచారు. కిటికీ తెరిచి చూసే సరికి, శ్వాన సైన్యం చేస్తున్న-ఆనంద లాస్యం, సంగీత సాధన - కనులు, వీనులు రెండింటికీ కఠోరమయింది.

మంత్రిగారు కిటికీరెక్కలు మూసే సారు. కాని ప్రకృతిలో ధ్వనించి, రమించి, ప్రతిధ్వనిస్తున్న ఆ భైరవ నాదాన్ని ఎలా ఆపెయ్యగలరు!

పాపం! నిద్రకి కరువయింది.

ఆరోజే కాదు, అంతకు ముందు రెండురోజుల్నించీ అతను నిద్రకి కను మరుగయే ఉన్నారు.

నిద్ర అతనికి చాలా అవసరం.

'కనీసం కొన్ని గంటలు, కాకపోతే ఒకగంట నిద్రిస్తే చాలు, మర్నాటి కార్య క్రమం హుషారుగా నడిపించవచ్చు.' అతను పక్కమీద లేచికూర్చొని, నిద్రా ప్రణాళికను తిరగెయ్యసాగారు.

1. చెవుల్లో ముఖమల్ గుడ్డ దట్టిం చడం.

2. నిద్రమాత్రలు సేవించడం.

మొదటిదానివల్ల శబ్దం శాంతించ లేదు. రెండో పనికి అలవాటు పడిన ప్రాణం ఈ రోజు సహకరించడం మానే సింది. ఎక్కువగా సేవించడానికి భయం!

ఇక పోతే—

3. కుక్కల్ని తరిమెయ్యడం.

4. భగవధ్యానం- మంత్రజపం.

మూడోది అమ్మబాబోయ్!

నాలుగోది, వెల్లకిలా పడుకొని సాధిం చడం మొదలుపెట్టారు.

"అపదాం అపహతరిం, దాతారి.

స్వప్న దుర్లభం,

లోకాభిరామం శ్రీరామం, భూయో

భూయో నమ్యామ్యహం"

కాని ఏకాగ్రత కుదరలేదు.

'ఆపదాం.... భౌవ్, వౌవ్, వౌవ్.... అపహతరిం.... కేంవ్, వేవ్, వేవ్....'

మరింక పక్కమీద పడుకోలేక పోయారు మంత్రిగారు. గది బయటికి వచ్చి కుక్కలవంక చూశారు, టార్చి లైట్ వెలుగులో. 'ఒకటి, రెండు, మూడు....' అమ్మబాబోయ్! ఇరవైకి పైనే ఉన్నాయి.

ఇరవైల సంఖ్యలో ఉన్న కుక్కలు కూడ, అతనివంక అపోజిషన్ మెంబర్లలా మిర్రిమిర్రి చూసి, కొంతదూరం వాకౌట్‌చేసి, తిరిగి అరుపులు లంకించుకున్నాయి.

'ఇప్పుడేం చేయాలి?!'— తీసుకొచ్చిన జీపు డ్రయివర్‌నీ, వెంటవచ్చిన అంగరక్షకుల్నీ తనే తిరిగి పంపించేశాడు. మర్నాటి కార్యక్రమం కోసం—జండాలు, దండలు, నినాదాలిచ్చే గొంతుకలు వగైరా ఏర్పాట్లతో తెల్లారేసరికి వచ్చి తోడ్కొనిపోడానికి.

ఆ డ్రైవరే కాని ఉండిఉంటే, ఈ దిక్కుమాలిన కుక్కలమీదుగా జీపు తోలించి ఉండేవాడు. కాని - ఇప్పుడు ఒంటరివాడయిపోయాడు.... అరే! చౌకీదార్!....బ్లడీబాస్టర్డ్.... ఏమయ్యాడు?!'

"చౌకీదార్, ఓ చౌకీదార్!"

జవాబు బోట్‌హౌస్‌నుంచి రాలేదు. అపోజిషన్ నుంచి వచ్చింది, 'బౌవ్, వౌవ్, వౌవ్'.... అంటూ.

మంత్రిగారి కోపానికి పిడికిట్లో టార్చిలైట్— బిగుసుకొంది. చౌకీదార్‌కోసం. బోట్‌హౌస్ వైపు దారితీసాడు అతను.

బోట్‌హౌస్ వరండా గచ్చుమీద, తుంగచాప పరచుకొని, తలకింద ఒక బట్టలమూట పెట్టుకొని, పలచటి దుప్పటి కప్పుకొని, గాఢ నిద్రలో పడుకొని ఉన్నాడొక మనిషి.

ఎంత హాయిగా నిద్రపోతున్నాడు!

టార్చిలైట్ వెలుగు, ఆ వ్యక్తి ముఖం మీదనుండి, కాళ్లవరకు జారి తిరిగి ముఖంపైన నిలిచింది.

కాషాయ రంగు బట్టలు, కాషాయ రంగు దుప్పటి, సగం— సగం నెరిసిన గుబురు గడ్డం—మీసాలు, తల పక్కనే దండం, కమండలం.

ఎవరో సాధువులా ఉన్నాడు. ఎంత హాయిగా నిద్రపోతున్నాడు!!

"చౌకీదార్!" గట్టిగా పిలిచారు మంత్రిగారు.

సాధువుకి తెలివి వచ్చింది. లేచి కూర్చొన్నాడు. "రాత్రిపూట చౌకీదార్ ఇక్కడ ఉండడు బాబూ! ఊళ్లోకి పోతాడు. అతనికి బదులు నేనుండాను. ఏదైనా పనిఉంటే చెప్పండి, చేస్తాను."

"స్వామీజీ! మీరు!! మీరు చేస్తారా పనిని?"

"ఏం పని బాబూ! ఆ కుక్కల్ని తరిమెయ్యడమేనా?"

"అవును స్వామీజీ, వింటున్నారు కదా, అవి ఎంత చేటుగా అరుస్తున్నాయో, ఆ గోలలో నిద్ర ఎలా పడుతుంది!!"

"అలాగే తరిమేస్తాను బాబూ! కాని మరి కాసేపటికి అవి మళ్ళీ వచ్చి మొదలు పెడితే ఏం చేయాలి? వాటిని తిరిగి రాలేనంత దూరం తరిమెయ్యమంటారా, లేక వాటి అరుపుల్ని వినిపించనంత దూరం (ప్రీక్వెన్సీ)- పెంచెయ్యమంటారా? అలా చేస్తే నిద్రించగలరా?" స్వామి తన కమండలాన్ని చేత తీసుకొన్నాడు.

మంత్రిగారికి, స్వామి ప్రశ్నలో తిరకాసు- ధ్వనించింది, 'మీకు కావలసిందేమిటి, నిద్రా, లేక ఆ కుక్కలపైన పగా? వాటి రాజ్యంనుంచి వాటిని తరిమెయ్యడంగాని, లేక అరుపులు మూసేసి, సెకెండ్-క్లాసు సిటిజన్‌లగా మార్చడం గాని ఎంతవరకు సబబు?' అన్నట్లుగా ఉంది ఆ తిరకాసు.

"స్వామీజీ, నాకు కావలసింది నిద్ర.."

మధ్యలోనే అందుకొన్నాడు స్వామి. "ఆ నిద్రని చౌకీదారు గాని, నేను గాని, ఇంకో మనిషి గాని ఎలా ఇవ్వగలరు బాబూ! అలా ఇవ్వగలిగే పక్షంలో, నా నిద్రని మీకు ధారపోసి ఉండేవాడిని."

'ఈ సాధువుని ఏదైనా ఎంక్వైరీ కమీషన్ హెడ్ చేయవచ్చు' అనిపించింది మంత్రిగారికి. 'కుక్కల పైన తన కోపంలో అర్థంలేదని తనే గుర్తించేలా చేసాడు, ఇప్పుడు నిద్ర మరొకరు తెచ్చి ఇవ్వలేరనే ప్రాథమిక సత్యాన్ని మరిచి పోయినట్లు నిరూపించేసాడు. గడుసు పిండమే! అయినా కానీ,....లాంటి తన దగ్గరా కప్పిగెంతులు!"

"స్వామీజీ, మీ నిద్రని త్యాగం చేయనక్కరలేదు ఒకవేళ ఇవ్వగలిగినా ఆ ఇచ్చే నిద్రాదానం ఎంత ఉత్కృష్ట మైనదైనా, స్వీకరించే- హీనస్థితిలో లేను నేను నాకు స్వశక్తి మీద, ఆత్మబలం మీద చాల నమ్మకం ఉంది. మీరు, ఈ కర్ణకఠోరమైన అరుపుల మధ్య ఎలా నిద్రపోగలుగుతున్నారో చిట్కా చెప్పండి."

"గోసాయి చిట్కా చెబితే చాలా బాబూ, విప్పనక్కరలేదా?" ముఖ్యమైన విషయంలో, విధిలేక తనని పిలిచి, సలహా అడిగినప్పుడు, బదులడిగే ప్రతిపక్ష నాయకుడిలా అడిగి, ఫోజు కొట్టాడు స్వామి.

"ముందు చిట్కా చెప్పండి స్వామీజీ!" మంత్రిగారు కూడ తన రాజకీయ జీవితంలో ఏనాడూ తొందర పడలేదు.

స్వామి తన చిట్కాని ఇలా చిటపటాయించాడు. "ఈ కుక్కలు మీ నిద్ర పాడుచేసే ఉద్దేశంతో ఇక్కడికి రాలేదు బాబూ! మీరిలా వస్తారనిగాని- వచ్చారని గాని వాటికి తెలియదు. వాటి పని అలవాటుగా చేసుకొంటున్నాయి. ఆ అరుపుల వల్ల మీరు ఇబ్బందిపడుతున్నారే గాని,

అవి మిమ్మల్ని ఇబ్బందిపెట్టడంలేదు."

"మీ తర్కం నా కర్థమయిందిలెండి స్వామీజీ! వాటి అరుపులు ఎంత స్వాభావికమైనవే అయినా, నేను వాటి స్వాతంత్ర్యాన్ని మన్నించి ఎలా ఇబ్బంది పడకుండా ఉండగలను? ఒకరి హక్కు, ఇంకొకరి స్వేచ్ఛకి అంతరాయం కలిగించేలా ఉండకూడదు గదా!"

"నిజమే బాబూ! కాని వచ్చిన చిక్కేమిటంటే ఆ కుక్కలు సివిక్సు చదువుకోకపోవడమే! ఆ కుక్కలే కాదు, నగరంలో మీరు పెట్టిన పరిశ్రమలు, మీరు నడిపే వాహనాలు, యంత్రాల వాటిపని అవి చేస్తూ, మీలాంటి నాగరికుల నిద్రల్ని పాడుచేస్తూనే ఉన్నాయి. మరి వాటి సంగతి ఏమిటి? ఈ యంత్రాలు జంతువులు రణగొణ ధ్వనిని మనకి అనుకూలంగా మార్చుకోవడమో, లేక మనమే వాటికి అనుగుణంగా మారిపోవడమో- అదే ఇప్పుడు చెయ్యాల్సిన పని."

'అమ్మ , బైరాగిముండాకొడకా! కుక్కలకీ-యంత్రాలకీ ముడి పెట్టేసావా?' మనసులోనే స్వామిని దీవించేసారు మంత్రిగారు. "స్వామీజీ, మీ రన్న మొదటి పాయింటు జరగని పని, రెండోది సబబుగానే ఉంది, కాని...."


"మీరా కుక్కల అరుపులతో దెబ్బలాడవద్దు. అలా చెయ్యబట్టే ఇబ్బంది పడుతున్నారు వాటి అరుపుల్ని నిమిత్తం చేసుకొని, మీకు మీరే చిరాకుపడిపోతున్నారు. అరవకుండా ఉంటే మీరు పడుకోగలరు, అదేకదా మీ షరతు! ఆ షరతుని అవి వినవు, అవి కుక్కలు కాబట్టి వినవు. అందుచేత మీ షరతుని మీరే తొలగించుకొని వాటి అరుపుల్ని స్వీకరించండి. అవి ఆగితేగాని నిద్రపోలేనన్న భావనకి దూరంకండి. వాటి ఆక్రోశాన్ని అసహ్యించుకోకండి, వాటిని వినకుండా ఉండాలనే ప్రయత్నం కూడ చెయ్యకండి. ఏ ప్రయత్నమూ చేయకుండా, మీ షరతు తొలగించుకొని ఆనందంగా - స్వీకరించండి. కాస్త వినండి, అవి ఎంత ప్రాణశక్తితో అరుస్తున్నాయో! ఎంత సహజంగా ఆలాపిస్తున్నాయో!! వాటినే మంత్రంగా చేసుకొని లయం అయిపోండి."

"స్వామీజీ, నా చెవులకే కాదు సమస్త ఇంద్రియాలకీ ఆ అరుపులు దుర్భరంగా ఉన్నాయి. వాటిని నే నెలా మంత్రం చేసుకోగలను?"

"అవును చేసుకోలేరు. ఎందుకంటే మీ ఇంద్రియాలు మీకు సహకరించడం మానేసాయి. మీ శరీరమే మీ స్వామిత్వాన్ని అంగీకరించనప్పుడు, కుక్కల్ని ఎందుకు ఆడిపోసుకొంటారు?"

"స్వామీజీ! మీలా అంతమందీ జితేంద్రియులు కాలేరు కదా?"

"అవును బాబూ, అంత మందీ జితేంద్రియులు కాలేరు. నిజానికి వాటిని




— టి.వీ కొనమన్నప్పుడల్లా ఇక్కడికి తీసుకొస్తారు... ఏంటి మీ ఉద్దేశ్యం..

జయించే ప్రసక్తే రాకూడదు. దేన్నైనా లొంగదీసుకోడానికి, దాన్ని జయించాలనే ఆలోచనే తప్పు. ఎంతలా జయించాలనుకొంటే, అవి అంతలా తిరగబడతాయి. వాటిని ప్రేమించాలి, లాలించాలి. చెప్పాల్సిన తీరులో చెపితే, అవి మనకి దాసోహం చేస్తాయి."

"నా శరీరాన్ని నేను ప్రేమించడం లేదంటారా?" సినిమా హీరోలాంటి తన దేహ ఘటనవైపు సంతృప్తిగా చూసుకొంటూ అడిగారు మంత్రిగారు.

"లేదు. తిండి పడేసి కండలు పెంచడం, శరీరాన్ని శరీరాన్ని ప్రేమించడం కానేకాదు. ఉదాహరణకి మీ అరికాలునే తీసుకోండి, దాన్ని రోజుకోసారి, లేదా- వారానికోసారి, పోనీ నెలకోసారైనా తలచుకొంటున్నారా?"

మంత్రిగారు ఆలోచనలో పడ్డారు, 'నిజమే! అరికాలుని తనెప్పుడు తలచుకొన్నాడు! ఏభయిరెండేళ్ల జీవితంలో ఏ మూడు నాలుగుసార్లో!! అది కూడ, ఏ గాజుపెంకో గుచ్చుకొన్ననాడు....'

అతని ఆలోచన్ని పసిగట్టేసినట్లున్నాడు స్వామి. "చూసారా బాబూ! నొప్పి కలిగినప్పుడే మీరు వాటిని స్మరించారు, దాన్ని కాసేపు నిమిరి లాలించారు. తక్కిన జీవితకాలమంతా దానిమీదే నడిచారు. అలాంటివే మీ శరీరంలో 26

కేంద్రాలున్నాయి బాబూ! మీరు వాటికి తిండి పడేసి, వాటిచేత మీ అవసరాల మేరకి పనిచేయించుకొంటున్నారు. అవి కూడ వాటి పరిధుల్లో కుక్కల్లాగే విశ్వాస పాత్రంగా మీ పని చేస్తున్నాయి. కాని, ఏనాడు మీరు వాటిని ప్రేమించారు? ప్రేమా- లాలన లేనిదే ఇలాంటి సందర్భాలలో అవి మీ కెందుకు సహకరిస్తాయి? మీ హక్కుకోసం వాటి స్వేచ్ఛని అరికట్టే అధికారం, ఏ సివిక్సన మీ కొచ్చింది??"

మంత్రిగారు తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎందరో నాయకుల మాటలు విన్నారు. ఇంకెందరో డాక్టర్ల సజెషన్లు తీసుకొన్నారు. 'ఈ రోజు ఈ బైరాగి- దేశం దాకా ఎందుకు, నా దేహం సంగతీ నాకు తెలియదంటున్నాడు. నీ హుకుం నీ శరీరంపైనే పనిచేయడం లేదంటున్నాడు. ఇతన్ని ఇంకా ఇలా మాట్లాడనిస్తే పూర్తిగా బ్రైన్‌వాష్ చేసేలా ఉన్నాడు. లాభం లేదు ఈ వాక్ప్రవాహానికి, 'డామిట్'-


"స్వామీజీ ఇప్పుడేం చేయమంటారు?" అంటూ 'దేమ్' కట్టేసారు.

"మీ శరీరంలోని 26 కేంద్రాలలోనూ మనసుని ప్రవేశింపచేసి- పది-పదిహేను సెకెండ్ల సేపు వాటిని లాలించండి. కుక్కల ఉనికిని గాని, వాటి అరుపుల్ని గాని మరిచిపోయే ప్రయత్నం చేయవద్దు. అన్నిటికన్నా మంచి పద్ధతేమిటంటే, ఆ కుక్కల్నే మీ శరీర కేంద్రాలుగా భావించండి. ఒక్కొక్క కుక్కనీ, ఒక్కొక్క అంగంగా దగ్గర నిలబెట్టి, వాటి ఆక్రోశాన్ని విని, ఈ రోజునుంచి వాటిసంగతి పట్టించుకొంటానని వాగ్దానం చేసి, శాంతించమనీ, నిద్రించమనీ అర్థించండి అప్పుడే మీరు తృప్తిగా నిద్రపోగలుగుతారు."

"స్వామీజీ! నా అజ్ఞానాన్ని మన్నించి ఆ కేంద్రాలేవో తెలియజెయ్యండి" మంత్రిగారీసారి తమ అజ్ఞానాన్ని చిత్తశుద్ధితో ఒప్పుకొన్నారు.

"తప్పకుండా చెప్తాను బాబూ! శ్రద్ధతో వినండి-

| | | |
|---|---|---|
| 1 | అరికాళ్లు | —2 కుక్కలు |
| 2 | మోకాళ్లు | —2 కుక్కలు |
| 3 | తొడలు | —2 కుక్కలు |
| 4 | గుహ్యేంద్రియం | —1 కుక్క |
| 5 | నాభి | —1 కుక్క |
| 6 | హృదయం | —1 కుక్క |
| 7 | ఊపిరితిత్తులు | —2 కుక్కలు |
| 8 | భుజస్కంధాలు | —2 కుక్కలు |
| 9 | కుడి అరచేయి, మోచేయి, భుజం | —3 కుక్కలు |
| 10 | ఎడమ అరచేయి, మోచేయి, భుజం | —3 కుక్కలు |
| 11 | కళ్లు | —2 కుక్కలు |
| 12 | చెవులు | —2 కుక్కలు |
| 13 | ముఖం | —1 కుక్క |
| 14 | ముక్కు | —1 కుక్క |
| 15 | భృకుటి | —1 కుక్క |
| | మొత్తం 26 కేంద్రాలు | = 26 కుక్కలు |



పై కుక్కల్ని వరుస క్రమంలో తలచుకొని, లాలించి 26 కుక్క దాకా వచ్చాక, తిరిగి విలోమ క్రమంలో మొదటి కుక్క వరకు, పది-పదిహేను సెకెండ్ల సేపు తలచుకొని లాలించండి."

మంత్రిగారికి మరి మాటల్తో పొద్దు పుచ్చాలనిపించలేదు, "వస్తాను స్వామీజీ!" అంటూ బంగళావైపు నడిచారు. వెళ్తూ పెళ్తూ ఆగి, ఆ కుక్కల వంక చూసారు.

ఈసారి ఆ చూపులో ఏముందో! కుక్కలు ఏం పసికట్టాయో కాని, క్షణం విరామాన్నిచ్చేయి.

మంత్రిగారు వాటిని లెక్క పెట్టారు.

ఆశ్చర్యం!—

సరిగ్గా 26 ఉన్నాయి అవి!!

* * *

తెల్లగా తెల్లవారిపోయింది.

మంత్రిగారు ఆవలిస్తూ నిద్రలేచారు. బద్ధకంగా తనవైపు చూసుకొన్నారు. ఇదేమిటిది! తనెలా నిద్రపోయాడు!! కుక్కలు ఏమయ్యాయి! తను నిద్రపోవడమే కాదు. ఆ నిద్రలో ఒక స్వప్నాన్ని కూడ చూసాడు!

ఆ స్వప్నాన్ని తలచుకోగానే అతని ఒళ్లు జలదరించింది. ఎంత చిత్రమైన కల అది! దాని ఫలితమేమిటో ఆ బైరాగినే అడిగి తెలుసుకోవాలి.

మంత్రిగారు వెంటనే లేచి బోట్ హౌస్ చేరుకొన్నారు.

స్వామి సిద్ధాసనంలో కూర్చొని ధ్యానంలో ఉన్నాడు. అయినా మంత్రిగారి పిలుపుకి కళ్లు తెరిచి, చిరునవ్వుతో "నిద్ర పట్టిందా బాబూ!" అని అడిగాడు.

"మీ దయవల్ల నిద్రపోయాను స్వామీజీ. ఆ నిద్రలో ఒక కల కూడ కన్నాను. చాల చిత్రమైన కల అది...."

"ఏమిటి బాబూ ఆ కల?"

"కలలో నాకొక వ్యక్తి కనిపించాడు. అతని కాళ్లు ముందుకీ లేవు, వెనకకీ లేవు. అలాగని పక్కలకీ లేవు. తిరగలిలా తిరుగుతున్నాయి. అతని మెదడు మోకాళ్ల మీద ఉంది. పొట్ట బానలా ఉంది. చేతులకి వేళ్లకి బదులు నాలికలున్నాయి. కళ్లు ఉండాల్సినచోట చెవులు, చెవులుండాల్సిన చోట కళ్లు ఉన్నాయి. గుప్తేంద్రియం ఎక్కడుందో కనిపించనే లేదు. స్వామీజీ ఆ వ్యక్తి ఎవరు, ఎందుకలా ఉన్నాడు?"

స్వామి కాసేపు మంత్రిగారి వంక చూస్తూ ఉండిపోయారు. తరువాత గంభీరంగా బదులిచ్చాడు.

"ఆ వ్యక్తి ఎవరో ఎందుకలా ఉన్నాడో తెలుసుకొనే ముందు, అతని స్వభావం తెలుసుకో బాబూ! మీ కలలోని మనిషి ఎటుకావాలంటే అటే నడవగలడు కాని అతని అడుగు ఎప్పుడూ ముందుకు పడదు. దిశలు మార్చుకొంటూ తన దారి తను చూసుకొంటుంది. అతని మెదడు మోకాళ్ల స్థాయిలోనే ఉంది. చేతులకున్న నాలికలు అందిన ప్రతీదాన్నీ జుర్రుకోవడాన్నే సూచిస్తున్నాయి. కడుపు సంగతి సరేసరి! ఎన్నిటినైనా జీర్ణం చేసుకొంటుంది. అతను చూడాల్సినచోట వింటున్నాడు, వినాల్సినచోట చూస్తున్నాడు. పోతే గుప్తేంద్రియం కనిపించనే లేదన్నారు కదూ! లేకపోవడమేం బాబూ మెదడులోనే ఉందది. మెదడంతా ఆక్రమించి దాన్ని పూర్తిగా వాసనా కేంద్రంగా మార్చింది. తెలిసిందా ఇదీ ఆ మనిషి తత్వం...."

మంత్రిగారు ఆలోచనలో పడడం చూసి స్వామి తన ప్రసంగాన్ని ఇంకా కొనసాగించాడు.

"చీకటి గదిలోకి, దీపం తీసుకు వేళ్తేనే దాని స్వరూపం తెలుస్తుంది. ఆ గదిలో ఉన్న ఫర్నిచర్ కంటపడుతుంది. నిన్నరాత్రి నిద్రలో మీ వివేక దీపం వెలిగించుకొని, తొలిసారిగా మీరు మీ శరీరంలోకి ప్రవేశించారు...."

"స్వామీజీ!" దాదాపు అరిచినంత పనిచేసారు మంత్రిగారు. "మీ రనేదేమిటి స్వామీజీ! నేను చూసింది నన్నేనా!... అంటే నా ఆత్మనా!! నాకు కలలో జరిగింది ఆత్మసాక్షాత్కారమా!!"

స్వామి బదులివ్వలేదు. కళ్లు మూసుకొని ధ్యానంలో పడ్డాడు.

---